క్లుప్తంగా

వేతనదారులకు ఉపాధి పనులు



పునికిన వలస గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునికిన వలస గ్రామంలో 'ఉపాధి కోసం ఎదురుచూపులు' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఆ గ్రామ ఉపాధి కూలీలకు పనికల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మురళి గ్రామంలో ఉపాధి కూలీలతో సోమవారం పనిచేయించి వారికి మస్టర్ వేశారు. జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ ఆదేశాలు ఇచ్చారని ఈ మేరకు గ్రామంలో కూలీలతో మాట్లాడి పనిచేయిస్తున్నామని ఫీల్డ్ అసిసెంట్ స్పష్టం చేశారు.

మానిటర్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



వెంకటాపురంలో రిజిస్ట్రేషన్ పనులను పరిశీలిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రెవెన్యూ గ్రామాల భూముల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను మానిటరింగ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న వెంకటాపురం, అంటిపేట, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో సోమవారం వ్యవసాయ సహాయకులు చేస్తున్న మానిటర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయసహాయకులు నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని వేగవతం చేయాలని కోరారు. వ్యవసాయ సహాయకులకు అవసరమైన ఆధారాలను సమకూర్చి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌తో రక్త హీనత నివారణ

- ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి



గర్భిణులు, బాలింతలకు వంట చేస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

సాలూరు రూరల్: ఫోర్టిఫైడ్ రైస్‌తో గర్భిణుల్లో రక్తహీనత నివారించవచ్చని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మండలంలోని మామిడిపల్లి అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అలాగే ఫోర్టిఫైడ్ రైస్‌తో ఫుడ్ ఐటమ్స్ తయారు చేసే విధానాన్ని వివరించారు. అలాగే అందులో ఉండే ఫోలిక్ వల్ల గర్భిణులకు రక్తహీనత తగ్గుతుందని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఫోర్టిఫైడ్ రైస్ గర్భిణులు, బాలింతలు మాత్రమే వినియోగించాలని సూచించారు. నార్మల్ రైస్ కడిగినప్పుడు అందులో తేలియాడే బియ్యం ఫోర్టిఫైడ్ రైస్ అని వాటిని పారేయకూడదని తెలిపారు. సీడీపీఓ చేతులతో గర్భిణులు, బాలింతలకు వండిపెట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మద్యం షాపులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ దాసు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ దాసు హెచ్చరించారు. 'బ్రాండెడ్ మద్యం ఎక్కడ' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు.ఈ మేరకు సోమవారం పట్టణంలోని మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న స్టాకు రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం షాపుల్లో నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదంటే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.

ప్రచారానికే పరిమితం

- ఆచరణలో ఆమడదూరం
- 'తూతూమంత్రంగా 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ పనుల నిర్వహణ
- కాలువల్లో పేరుకుపోయిన మురుగు
- దోమల దండయాత్రతో అవస్థలు పడుతున్న ప్రజలు



చాకలివీధిలో నీటి పంపు వద్ద రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

పార్వతీపురంరూరల్:

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రచారానికే పరిమితమైంది. పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది. వీధుల్లో ఉన్న కాలువల దుస్థితి చూస్తుంటే పారిశుధ్య పనులు తూతూ మంత్రంగా అధికారులు నిర్వహిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. ఇళ్లను అనుకుని ఉన్న కాలువల్లో పేరుకుపోయిన మురుగు నిల్వలు అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి.

అలుముకున్న నిర్లక్ష్యం

సమయానికి విధులకు వచ్చామా..వెళ్లామా అనే ధ్యాసే తప్ప పనుల్లో జవాబుదారీతనం కొరవడింది. పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్య ధోరణి బాగా పెరిగింది. మండలస్థాయి అధికారులు సైతం పారిశుద్ధ్యం పనులపై దృష్టిసారించడం మానేశారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం..మరునాడే వదిలేయడం పరిపాటిగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణ మా బాధ్యత కాదు అన్నట్లు అధికారులు చేతెలెత్తేశారు. డ్రైనేజీ వ్యవస్థ మరీ దారుణంగా ఉంది మురుగునీరు నిల్వలు స్తంభించిపోయి దుర్వాసన వస్తోంది. చెత్తాచెదారానికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. రాత్రి పగలు తేడాలేకుండా దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తూ రోగాలకు గురిచేస్తున్నాయి.

ప్రతి పంచాయతీకి పారిశుద్ధ్యం నిధులు

> ప్రతీ పంచాయతీకి పారిశుద్ధ్య పనులకు సంబంధించి నిధులు కేటాయించాం. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పరిచేందుకు కమిటీని ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం. మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.
> – టి. కొండలరావు, డీపీఓ, పార్వతీపురం



నర్సిపురంలో చినవీధిలో కాలువలో పేరుకుపోయిన చెత్త



కూనేటి వీధిలో కాలువలో నిలిచిన మురుగునీరు



సచివాలయం ఎదురుగా పేరుకుపోయిన చెత్త

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

పార్వతీపురంటౌన్: ఈనెల 27 న జరగనున్న శాసన మండలి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచే కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్)గా శాసనమండలిలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ పరిరక్షణకు శక్తివంచన లేకుండా పనిచేశామని, ప్రభుత్వాలను నిలదీశామని, అదే ఒరవడిని కోరెడ్ల విజయగౌరి కొనసాగిస్తారని, అందుకు ఆమెను మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ మేరకు అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. భాస్కర రావు

కలాసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కలాసీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న దృశ్యం

మక్కువ: స్థానిక దుర్గా కలాసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను ఆ సంఘం నాయకులు బూరాడ గౌరు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గోపాలం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలాసీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎం. గోపాలం, అధ్యక్షుడిగా బూరాడ గౌరు, వైస్‌ప్రెసిడెంట్‌గా ఎ.అప్పారావు, సెక్రటరీగా పి.గంగరాజు, జాయింట్ సెక్రెటరీగా ఆర్. అప్పారావు, కోశాధికారిగా బి.అప్పారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలం మాట్లాడుతూ ప్రస్తుతం పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వాలు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించేందుకు మనమంతా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కలాసీలు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే పక్కాగా ఉండాలి



బూర్జలో ఆరోగ్య సర్వే పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్‌మోహనరావు

సీతానగరం: వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వే పక్కాగా ఉండాలని, వ్యాధి లక్షణాలు గుర్తించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. తన పర్యటనలో భాగంగా సోమవారం బూర్జ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. రోజులో ఎంతమందికి వైద్యసేవలు అందిస్తున్నారు? ఓపీ రికార్డులో నమోదు సంఖ్య, ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారో పరిశీలించారు. దీర్ఘకాలిక రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్ లక్షణాలు సకాలంలో గుర్తించడం అవసరమని తద్వారా వ్యాధి తగ్గుముఖం పట్టడానికి దోహద పడుతుందన్నారు. ముఖ్యంగా ఓరల్‌క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడంపై ఎక్కువ శ్రద్ధ చూపాలని సూచించారు. అలాగే లెప్రసీ సర్వే, స్కూల్ హెల్త్‌స్క్రీనింగ్‌పై ఆరాతీశారు. గ్రామాల్లో ఎక్కడైనా జ్వరాలు, డయేరియా, లక్షణాలున్న కేసులు వస్తే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే మందుల లభ్యత, వైద్య పరికరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమ్యసాయి, వైద్యసిబ్బంది, 104 సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దుచేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు బలగ రాధ

సాలూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్ వర్కర్స్‌కు ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దుచేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు బలగ రాధ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద సిబ్బందితో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్ వర్కర్స్‌ను ఎఫ్ఆర్ఎస్ వేయాలని ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివవిశ్వేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థుల స్నాక్స్‌కు రూ.5వేలు వితరణ

సాక్షి ఎఫెక్ట్...



నగదును బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు అందిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ బలిజిపేట మండలంలో పనిచేసి బదిలీపై విశాఖ వెళ్లిపోయిన ఇరిగేషన్ ఏఈ కవిత విద్యార్థుల స్నాక్స్ నిమిత్తం రూ.5వేలు వితరణగా అందించారు. సాక్షి దినపత్రికలో ఈనెల 14వ తేదీన ప్రచురితమైన 'దాతలు స్పందించండి' అనే కథనంపై ఆమె స్పందించారు. వెంటనే మండల విద్యాశాఖాధికారి-1సామల సింహాచలంతో మాట్లాడి రూ.5వేలు పంపించి విద్యార్థుల స్నాక్స్ నిమిత్తం ఖర్చు చేయాలని కోరారు. ఈ మొత్తాన్ని ఆయన సోమవారం బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు అందించారు. ఆమె మానవతా దృక్పథంతో అందించిన సహకారం ఎంతో గొప్పదని ఎంఈఓ సామల ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శివాలయ ప్రాణప్రతిష్ట



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో ఆరవిల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు అయ్యల స్వామియాజుల శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు బసవ రాజుల పర్యవేక్షణలో శివాలయ ప్రతిష్ట పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి గ్రామస్తుల సహాయ సహకారాలతో శివాలయ పునఃప్రతిష్ట పూజలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.
ఇందులో భాగంగా సోమవారం విగ్రహాలకు ప్రాణప్రతిష్ట పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు.

సీడీపీఓకు వినతి పత్రం అందజేత



ఐసీడీఎస్ పీడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

పార్వతీపురంటౌన్: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు ఎం.గౌరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం అంగన్వాడీ యూనిట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకురాలు ఇందిర, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



బలిజిపేటలో సీడీపీఓ శ్రీలేఖకు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల అంగన్వాడీలు సీడీపీఓ సులేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బలిజిపేటలోని సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి పీఓ సులేఖకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ జిల్లా కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ జూలైలో జీతాలు పెంచుతామని, మరో పదకొండు డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయలేదని వాపోయారు. జీతాలు పెంచలేదుకాని అనేక రకాల యాప్‌లతో, నూతన విధానాలతో పని భారం పెంచుతున్నారే తప్ప ఆర్థిక కష్టాలను గుర్తించడం లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నేటికి నెరవేర్చలేదన్నారు. సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు అందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు దాలమ్మ, సావిత్రి, స్వర్ణ, శైలజ, లక్ష్మి, యశోద తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌లో సిల్ట్‌తీత



వాటర్‌ట్యాంక్‌లో సిల్ట్‌తీస్తున్న కూలీలు

సీతానగరం: మండలంలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు నిరంతరాయంగా సరఫరా చేసేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు పెదభోగిలి, చినభోగిలి, బగ్గందొరవలస, తామరఖండి గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే పనులు చేపట్టారు. ఈ మేరకు పెదభోగిలి వాటర్ ట్యాంక్‌లో ఉన్న చెత్తను తొలగించే పనులను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో అన్నిగ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్‌లలో పేరుకు పోయిన చెత్తను తొలగించే పనులు చేపట్టాలని వైద్య సిబ్బంది సహకారం తీసుకుని క్లోరినేషన్ చేయించాలని సిబ్బందిని కోరారు. అలాగే బోర్లనుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు పంపిణీ చేస్తున్న నీటిలో క్లోరినేషన్ చేయడం, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు జిల్లా ఉన్నతాధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకుని సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీడితోటలకు పుల్లటి మజ్జిగతో మంచి ఫలితాలు



పుల్లటి మజ్జిగ తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగార్జున

మక్కువ: మండలంలోని దుగ్గేరులో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం యూనిట్ పరిధిలోని గ్రామాల్లో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.షణ్ముఖరాజు ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పుల్లటి మజ్జిగ తయారీ, విధానంపై అవగాహన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి ఉర్లక నాగార్జున మాట్లాడుతూ దుగ్గేరు, బొడ్డసామంతవలస, బట్టివలస, చీమిడివలస గ్రామాలలో పుల్లటి మజ్జిగ తయారీ చేసి, రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో పుల్లటి మజ్జిగ తయారుచేసుకుని, జీడి పంటలకు పిచికారీ చేయడం వల్ల పూత, పిందెలు రాలకుండా ఉంటాయని, బూజు తెగులు, ఆకుముడత తెగులును నివారిస్తుందన్నారు. పొగమంచు, మబ్బుల నుంచి తట్టుకుంటుందన్నారు. కావున జీడి మామిడి రైతులందరు పుల్లటి మజ్జిగ తయారీ చేసి, పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని, అలాగే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పనసభద్ర వీహెచ్ఏ జె.చంద్రశేఖర్, ఐసీఆర్పీలు కొండతామర అప్పలరాజు, దీసరి వెంకటరావు, రెడ్డి సుందరరావు, రైతులు మర్రి నారప్ప, మత్యేసు,కొండగొర్రి రాము పాల్గొన్నారు.

ఫారం పాండ్స్‌తో బహుళ ప్రయోజనాలు



మేట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మాణాలు జరుగుతున్న ఫారంపాండ్స్ వల్ల రైతులకు బహుళప్రయోజనాలు ఉన్నాయని ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు అన్నారు. ఈ మేరకు బక్కుపేట, బళ్లకృష్ణాపురం గ్రామాల్లో జరుగుతున్న ఫారం పాండ్స్ పనులను, వేతనదారుల మస్తరును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బక్కుపేటలో మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో వేతనదారులై ఉండి చిన్న సన్నకారు రైతులకు ఉపాధి పనులు కల్పించడం, సొంత స్థలంలో వర్షం నీరు నిల్వ ఉంచడానికి, భూగర్భ జలాలు నిల్వ ఉంచడానికి, నిల్వ ఉన్న నీరుతో స్వల్పకాలిక పంటలు పండించడానికి, మొక్కలకు నీరు సమకూర్చడానికి ఫారం పాండ్స్ దోహదపడతాయన్నారు. ప్రతిరైతూ తమ తోటలున్న పొలాల్లో ఫారంపాండ్స్ నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే నీటివనరులున్న ఫారంపాండ్స్‌లో చేపలు కొద్దికాలం పెంపకానికి ఉపయోగ పడతాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని చిన్నసన్నకారు రైతులు వినియోగించుకుని ఫారం పాండ్స్ నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేట్‌లు పాల్గొన్నారు.

వేరుశనగను ఆశించే తెగులు పట్ల అప్రమత్తం



వేరు శనగ పంటకు మందుద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

సీతానగరం: మండలంలో నీటి వనరులున్న గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న రబీ వేరుశనగ పంట ఏపుగా పెరగుతున్న సమయంలో చిత్త తెగులు ఆశించడం వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు బూర్జ, చెల్లంనాయుడువలస, గాదెలవలస, ఆవాలవలస గ్రామాల్లో వేరు శనగపంటలో ఆకులు నలబడి చిత్తకొట్టినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 56 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వేరుశనగ పంట సాగు చేస్తున్నారని తెలియజేశారు. ఏపుగా పెరిగి, పూత దశలో ఉన్నవేరు శనగ పంటకు ఆశించిన తెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పంటపై ఆశించే తెగులును పరిశీలించి తెగులు నివారణకు అవసరమైన క్రిమి సంహారకమందులు సిఫార్స్ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పంటకు చిత్తతెగులు సోకడంవల్ల ఎకలెక్స్ మందు ద్రావణాన్ని రైతులు పిచికారీ చేస్తున్నారన్నారు. తద్వారా కొంతమేర తెగులు నివారించవచ్చని చెప్పారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బలిజిపేట: బాల్య వివాహాలను అరికట్టాలని ప్రొటెక్షన్ అదికారి ఎంఏ నాయుడు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలోని మండల సమాఖ్య భవనంలో అంగన్వాడీ కార్యకర్తల ప్రాజెక్టు స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజిపేట ప్రాజెక్టులో డ్రాపవుట్ గ్రూపులు, ఎడాల్సిన్స్ గ్రూపులు, చైల్డ్‌వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీలు, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. ఇంతవరకు పూర్తయిన చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీలు, డ్రాపవుట్ కౌన్సెలింగ్ జాబితాలను సంబంధిత సెక్టార్ సూపర్‌వైజర్ల నుంచి తీసుకున్నారు. కార్యక్రమంలో బలిజిపేట సీడీపీఓ సులేఖ, సూపర్‌వైజర్లు పూర్ణిమ, పద్మావతి డీసీపీయూ సిబ్బంది ఆర్ హరికృష్ణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.